క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కే. ప్రకాష్

పగిడ్యాల: పుస్తక పఠనం చేయడం వల్ల జ్ఞానం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కే.ప్రకాష్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం పరిశీలించారు. పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల్లో పఠనాస్తకిని కలిగించేందుకు విజ్ఞాన శిబిరాలను జిల్లా వ్యాప్తంగా చేపట్టినట్లు వెల్లడించారు. చెస్, క్యారమ్స్ తదితర క్రీడా విభాగాలల్లో ప్రావీణ్యం పొందేందుకు క్రీడా సామాగ్రిని కూడా అందుబాటులో ఉంచామని స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్న లైబ్రేరియన్ మద్దమ్మను అభినందించారు.

వధూవరులకు ఆశీర్వాదం

పాములపాడు: మండలంలోని కోల్సానందాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ చిట్టిబాబు, చరితల వివాహం సోమవారం జరిగింది. వివాహానికి హాజరైన శాప్ చైర్మన్ బైరెడ్డిసిద్ధార్థరెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విజయసింహారెడ్డి, పార్టీ మండల కార్యదర్శి మధుసూదన్ రావు, నాయకులు చరణ్, దర్గయ్య, ఉపేంద్ర, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నందికొట్కూరు: నాటుసారా తయారు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని సీఐలు ప్రకాష్ కుమార్, విజయభాస్కర్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని నీలిషికారిపేటలో నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. 30 లీటర్ల నాటుసారా, 300 లీటర్ల బెలం ఊటను ధ్వంసం చేశారు. సీఐలు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొంది నాటుసారా తయారుకు స్వస్తి పలకాలని చెప్పారు. పద్ధతులు మార్చుకోకపోతే పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమన్నారు. దాడుల్లో ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



తమ్మడపల్లెలో టీకాలు వేస్తున్న లైవ్‌స్టాక్ ఆఫీసర్ సులోచన

మహానంది: పాడిపశువుల ఆరోగ్యంపై పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వాటిని ఆరోగ్యంగా ఉంచుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చేకూరుతుందని తమ్మడపల్లె విలేజ్ లైవ్ స్టాక్ ఆఫీసర్ జె.సులోచన అన్నారు. తమ్మడపల్లె గ్రామంలో సోమవారం పాడిపశువులకు గొంతువాపు వ్యాధి రాకుండా హెచ్ఎస్ నిరోధక టీకాలను వేశారు. సులోచన మాట్లాడుతూ గ్రామీణ పశువైద్యాలయాల ఆధ్వర్యంలో నల్ల జాతి పశువులు, బర్రెలు, దూడలు, కోడెదూడలు, ఆవులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. పాడిపశువుల పెంపకంలో మెలకువలు పాటిస్తే మేలైన లాభాలు పొందవచ్చన్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

నంద్యాల(అర్బన్): నాణ్యత కలిగిన విత్తనాలను మాత్రమే దుకాణ దారులు రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. విత్తనం కొన్న ప్రతి రైతుకు రసీదు ఇవ్వకపోతే విత్తన చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలోని నందమూరినగర్ రోడ్డులోని శ్రీ అన్నదాత, రైతు మిత్ర ఏజెన్సీస్ దుకాణాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్స్, స్టాక్ బ్యాలెన్స్ తదితరాలను పరిశీలించారు. అనంతరం ఆయా ఏజెన్సీల్లోని విత్తన నమూనాలను హెచ్‌టీ పరీక్షలకు తరలించారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించవద్దని సూచించారు.

రేపటి నుంచి చెన్నకేశవస్వామి తిరునాల

ఓర్వకల్లు : మండలంలోని శకునాల గ్రామంలో ఈ నెల 22 నుంచి చెన్నకేశవస్వామి తిరునాల నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవాలలో భాగంగా ఈ నెల 23న తెల్లవారు జామున 5.10 గంటలకు స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు చెక్కభజన కార్యక్రమం ఉంటుందన్నారు.

వాల్టా.. అంతా ఉల్టా!

- వృక్షాల నరికివేతకు బోర్లు, బావుల తవ్వకానికి అనుమతులు తప్పనిసరి
- ప్రజలకు అవగాహన కల్పించని అధికారులు
- ఇష్టారాజ్యంగా బోర్లు, బావుల తవ్వకాలు.. యథేచ్ఛగా చెట్ల నరికివేత
- దెబ్బతింటున్న పర్యావరణ సమతుల్యం
- పెగురుతున్న భూతాపం



అనుమతుల్లేకుండా బోరును తవ్వుతున్న దృశ్యం

జూపాడుబంగ్లా: ఏళ్లనాటి భారీ వృక్షాలను ఇష్టానుసారంగా నరికివేస్తుండటంతో వృక్ష సంపద తగ్గటంతో ఏటేటా ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం తగ్గడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. స్వార్థపరుల గొడ్డలివేటుకు పచ్చని వృక్షాలు నేలకూలుతుండటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. పర్యావరణ హితం కోసం ప్రభుత్వం వాల్టా చట్టాన్ని అమలులోకి తెచ్చినా ప్రజల్లో అవగాహనా లోపం, అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా అనుమతుల్లేకుండా ఇష్టారాజ్యంగా బోర్లు, బావులు తవ్వకోవడంతో పాటు చెట్లను నరికేస్తున్నారు.

2002 నవంబర్‌లో అమలులోకి..

2002 నవంబర్‌లో ప్రభుత్వం వాల్టా చట్టాన్ని అమలోకి తెచ్చినా ఇప్పటిదాకా అధికారులు దీనిపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో ఇష్టారాజ్యంగా బోర్లు, బావులు తవ్వకుపోవడంతో పాటు పచ్చని వృక్షాలను నేలకూల్చుతున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఓ మొక్కను నాటి సంరక్షించాల్సిన బాధ్యత ఉంది. ఈ మేరకు ఏటా వందల మొక్కలను ఉపాధి హామీ పథకం కింద నాటుతున్నా వాటి సంరక్షణ లోపం వల్ల ఆదిలోనే అవి చనిపోతున్నాయి. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, విద్యుత్‌శాఖ ఏఈ, ఈఓపీఆర్డీలతో కూడిన కమిటీ వాల్టాచట్టాన్ని పర్యవేక్షించాల్సి ఉంటుంది.

నిబంధనల అతిక్రమణ..

- వాల్టా చట్టం అమలుపై కమిటీ అధికారులు ప్రజలు, రైతులకు అవగాహన కల్పించలేకపోయారనే విమర్శలున్నాయి. అవగాహన ఉన్నా, లేకపోయినా అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఆసరాగా చేసుకొని కొందరు స్వార్థపరులు ఇష్టారాజ్యంగా బోర్లు, బావులు తవ్వకోవడంతో పాటు యథేచ్ఛగా పచ్చని వృక్షాలను నరికి టింబర్ డిపోలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.
- బోరుకు బోరుకు మధ్య 300 మీటర్ల నిర్ణీత వ్యత్యాసాన్ని అనుసరించకుండా రైతులు పక్కపక్కనే బోర్లు తవ్వకుంటుండటంతో నీళ్ల పడక అప్పులపాలవుతున్నారు. అంతేకాకుండా రైతుల మధ్య తగాదాలు నెలకొంటున్నాయి.
- రిగ్గుల యజమానులు రిగ్గులను 2 సంవత్సరాలకు ఓ పర్యాయం వాటి రిజిస్ట్రేషన్‌లను పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. అయితే అధిక వ్యయం ఖర్చు అవుతుందనే ఉద్దేశంతో చాలా మంది రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ చేయించకుండానే యథేచ్ఛగా రిగ్గులతో బోర్లు తవ్వుతున్నారు.
- రిగ్గుల రిజిస్ట్రేషన్, బావులు, బోర్ల రిజిస్ట్రేషన్ చేయించుకోకపోవడంతో ఏటా ప్రభుత్వానికి రూ.లక్షల ఆదాయానికి గండిపడుతోంది.



పచ్చని వృక్షాన్ని యథేచ్ఛగా నరికివేస్తున్న కూలీలు

వాల్టా చట్టం నిబంధనలు ఇలా..

- ఏదేని సంస్థ తరుపున గానీ, వ్యక్తి తరుపున గానీ బోరు, బావిని తవ్వించుకోవాలంటే ఆ ప్రాంత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని నిర్ణీత రుసుము చెల్లించి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. వాల్టాచట్టం కమిటీ చైర్మన్ అయిన తహసీల్దార్ దరఖాస్తులను పరిశీలించి 2002 ఆంధ్రప్రదేశ్ భూమి, నీరు, చెట్లు నిబంధనలకు అనుగుణంగా అన్ని సక్రమంగా ఉంటే బోర్లు, బావులు తవ్వకోవటానికి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.
- అనుమతిలేకుండా అక్రమంగా తవ్వకున్న బోర్లు, బావులను మండల వాల్టాకమిటీ సభ్యులు గుర్తించి వాటిని సీజ్ చేయవచ్చు.
- గ్రామాలు, ఇళ్లముందున్న పచ్చని వృక్షాలను నరికివేయాలన్నా వాల్టా చట్టం ప్రకారంగా తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వాల్టాచట్టం పర్యవేక్షణ కమిటీ అనుమతులిచ్చిన తర్వాతనే చెట్లను నరికివేయాల్సి ఉంటుంది.
- ప్రజల దరఖాస్తు మేరకు కమిటీ సభ్యులు వృక్షాలున్న ప్రాంతాన్ని పరిశీలించి వృక్షాలు జనసంచారానికి, నివా సగృహాలకు, ప్రజాప్రయోజనరీత్యా ఆటంకంగా ఉన్నాయని భావిస్తేనే నరికివేతకు అనుమతులివ్వాలి. ఆ మేరకు మాత్రమే చెట్లను నరికివేయాలి తప్పా ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తే వాల్టాచట్టం ప్రకారంగా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవచ్చు.



పొలాల్లో పక్కపక్కనే తవ్వుకున్న బోర్లు

ఆర్బీకేల్లో రాయితీ విత్తనాలు

జూపాడుబంగ్లా: మరో పక్షం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రాయితీపై జీలుగ, పిల్లపెసర విత్తనాలు అందజేస్తున్నట్లు ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీలుగ 10కిలోల ప్యాకెట్ ధర సబ్సిడీపై రూ.440, పిల్లిపెసర 8కిలోల ప్యాకెట్ ధర రూ.670 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఆధార్, పాసుపుస్తకం, సెల్‌ఫోన్ తీసుకెళ్లి రైతు భరోసా కేంద్రాల్లో పొందవచ్చని చెప్పారు. అలాగే ఖరీఫ్ సాగుకు అవసరమైన రసాయన ఎరువులు ప్రైవేటు దుకాణాల్లో ఇప్పటికే కావాల్సిన మేర ఉండగా, రైతు భరోసా కేంద్రాలకు ఎరువుల మంజూరు నిమిత్తం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. త్వరలో రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

350 క్వింటాళ్ల జీలుగలు పంపిణీకి సిద్ధం

మహానంది: మండలంలో రైతులకు పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పిల్లిపెసర విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామని వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 350 క్వింటాళ్ల జీలుగలు వచ్చాయన్నారు. అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మహానంది: బండిఆత్మకూరులోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బండిఆత్మకూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, చేపడుతున్న పనుల గురించి పూర్తిస్థాయి నివేదికలతో రావాలని ఆదేశించారు.

ఘర్షణలకు పాల్పడితే కటకటాలే



మాట్లాడుతున్న సీఐ శివకుమార్‌రెడ్డి

మహానంది: ఎన్నికల ఫలితాల రోజున గ్రామాల్లో ఎవరైనా పార్టీల పేరుతో ఘర్షణలకు పాల్పడితే కటకటాలు తప్పవని రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి హెచ్చరించారు. గోపవరం గ్రామంలో సోమవారం రాత్రి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. మహానంది, బండిఆత్మకూరు, గోస్పాడు ఎస్ఐలు నాగేంద్రప్రసాద్, మల్లికార్జున, నాగార్జునరెడ్డిలతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ఫలితాలు ఎలా వచ్చినా వాటిని స్వాగతించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత, పార్టీల పేరుతో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేందుకు అందరూ సహకరించాలన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



గువ్వలకుంట్ల గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు

కొత్తపల్లి: గ్రామాలలో ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని గువ్వలంకుంట్ల గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాలలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా వాహనాల తనిఖీలు, గ్రామాలలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయ్యేవరకు గ్రామాలలో అల్లర్లు, గొడవలు, ఘర్షణలకు చోటులేకుండా ప్రజలందరూ కలసిమెలసి ఉండాలన్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి పల్లకోత్సవం



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరుడికి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, హనుమంతు శర్మ, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు చేశారు. అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేసి ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు.

మాన్యం భూముల వేలంలో పెరిగిన ఆదాయం

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామంలో దేవాలయాల మాన్యం భూములను ఏడాది పాటు కౌలుకు వేలం పాటలను నిర్వహించారు. దేవాలయాల ఈఓ జనార్దన్‌శెట్టి, వేలం పాటల పర్యవేక్షణాధికారి వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో భూముల కౌలుకు వేలం పాటలు నిర్వహించగా శ్రీశంకరమల్లేశ్వరస్వామి వారి దేవస్థానానికి చెందిన 24.48ఎకరాల భూములకు రూ.6,32,700లు సమకూరింది. గతేడాది కంటే రూ.57,200ల ఆదాయం పెరిగింది. అలాగే వీరభద్ర, ఆంజనేయ, లింగస్వామి దేవస్థానాల భూములు వేలం వేయగా రూ.4,34,500లు సమకూరగా గతేడాది కంటే రూ.79,500ల ఆదాయం పెరిగినట్లు ఆలయ ఈఓ తెలిపారు. వేలం పాటల్లో ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ వెంకటరమణయ్యశెట్టి, రెడ్డి సుబ్బయ్య, పుల్లన్నయాదవ్, రైతులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమణకు గురైనా పట్టించుకోరా?

దేవస్థానాల భూములు ఆక్రమణకు గురైనా పట్టించుకోరా పట్టించుకోరా అంటూ రైతులు ఈఓ జనార్దన్ శెట్టిని ప్రశ్నించారు. పొలాలకు వెళ్లేందుకు రస్తాలు, పంటకాల్వలు ఏర్పాటు చేయటంతో పాటు పొలాల సరిహద్దులు చూపించాలని రైతులు కోరారు. అధికారులు సరైన సమాధానం చెప్పకుండా దాటవేయటంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కడుమూరు గ్రామంలో..

మిడుతూరు: మండల పరిధిలోని కడుమూరు గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ, ఆంజనేయ స్వామి ఆలయాలకు సంబంధించిన భూముల వేలం పాటలను సోమవారం నిర్వహించినట్లు ఈఓ ఏడీ వెంకటరమణ తెలిపారు. ఈఓ మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ, ఆంజనేయ స్వామి ఆలయాలకు సంబంధించిన 13.50 ఎకరాల భూమికి వేలం పాట నిర్వహించంగా గతంలో పాడిన వేలం పాట కంటే రూ.1,10,000 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. గతంలో రూ.1,86,000 రాగా, ఈ ఏడాది రూ. 2,96,000 వచ్చినట్లు వెల్లడించారు. పర్యవేక్షణ అధికారి బ్రహ్మానందరెడ్డి, ఏఎస్ఐ హరి ప్రసాదు , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

25న దేవాలయ భూముల కౌలుకు వేలం పాటలు

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరులో వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి, శ్రీ రామేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించిన దేవాలయ భూముల కౌలుకు వేలం పాటలను ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏడీ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన మొత్తం 105.73 ఎకరాలు సంబంధించి 25న ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో, రామేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన పొలం మొత్తం 57.66 ఎకరాల భూమిని రామేశ్వరస్వామి ఆలయంలో మధ్యాహ్నం 3 గంటలకు వేలం వేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్నవారు రూ.2వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు రూరల్: మండలంలోని రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్షావలి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు అవసరమయ్యే జీలుగ విత్తనాలు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం మండలానికి 10 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను మంజూరు చేసిందని, అవసరమైన రైతులు గ్రామాల్లో వ్యవసాయాధికారులను సంప్రదించి తమ పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు.

నేడు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఆలయ ప్రాంగణంలో బుధవారం తెల్లవారుజామున 5.20 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ వెంకటరమణ తెలిపారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్ల ఆశీర్వచనాలను పొందాలని కోరారు. ఉదయం 8 గంటలకు శేషవాహనము, రాత్రి 7.30 గంటలకు హనుమత్ ఉత్సవ కార్యక్రమములు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

23న కౌన్సెలింగ్

పగిడ్యాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 23న కర్నూలు జగన్నాథ గట్టు దిన్నె దేవరపాడు గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ నిర్వహించిన ఇంటర్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా 1:3 నిష్పత్తి ప్రకారం మిగులు సీట్లు భర్తీ చేస్తారని స్పష్టం చేశారు. ఎస్సీ బాలికలు 70.25 శాతం మార్కుల నుంచి 15.25 శాతం మార్కుల వరకు, ఎస్టీ బాలికలు 56.25 శాతం మార్కుల నుంచి 13 శాతం మార్కులు వచ్చిన వారు అర్హులన్నారు. బీసీ బాలికలు 84.75 శాతం నుంచి 45 శాతం, ఓసీ విద్యార్థినులు 79 శాతం నుంచి 41.25 శాతం మార్కులు సాధించిన వారు కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని పేర్కొన్నారు. బీసీ, ఎస్టీ, ఓసీ విద్యార్థినులకు ఉదయం 8.30 గంటలకు, ఎస్సీ విద్యార్థినులకు ఉదయం 11 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న మారుతీనగర్ మహిళలు

నందికొట్కూరు: మారుతీనగర్‌లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం పట్టణంలోని మారుతీనగర్‌లో పర్యటించారు. మారుతీనగర్ కాలనీ ప్రజలు మంచినీటి సమస్య, మురుగు కాలువల వల్ల వచ్చే దుర్వాసన గురించి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డీఈ నబి రసూల్‌కు కమిషనర్ సూచించారు. శానిటేషన్ సమస్యలు రాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని కుటుంబ సభ్యులకు బాండు అందజేస్తున్న ఈఓ, యూనియన్ నాయకులు

శ్రీశైలం: దేవస్థానంలో ఎలక్ట్రీషియన్‌గా కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న అనిల్‌కుమార్ గతేడాది మే నెలలో విద్యుత్ ఘాతానికి గురై మరణించారు. అప్పట్లోనే అతని కుటుంబానికి దేవస్థానం తరఫున రూ.2 లక్షలు అందజేశారు. కాంట్రాక్టు సిబ్బంది తమ ఒక్క రోజు జీతం రూ.2,78,438తో పాటు దేవస్థానం వారిచ్చిన రూ.2 లక్షలు కలుపుకొని రూ.4,78,438 అనిల్ కుమార్‌కు ఇద్దరు కుమార్తెలు లక్ష్మీవివిధ, ఎన్.లక్ష్మీ పేరున గ్రామీణ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. సోమవారం దేవస్థానం ఈఓ పెద్దిరాజు చేతుల మీదుగ కాంట్రాక్ట్ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది యూనియన్ నాయకులు గణాంక విభాగం పర్యవేశకులు ఉమేష్, ఎలక్ట్రికల్ విభాగం ఇన్‌చార్జి సుబ్బారెడ్డిలు ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అనిల్‌కుమార్ సతీమణికి అందజేశారు.

చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్ పరిధిలోని కేసీ కెనాల్ పరిధిలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శంకర్‌గౌడ్, తిమ్మారెడ్డి, గుట్టపాటి రామిరెడ్డిలపై అధికారులు చర్యలు తీసుకోవాలని శాతనకోట గ్రామ సర్పంచ్ జనార్దన్‌గౌడు డిమాండ్ చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వీరు ఈ నెల 13న పోలింగ్ రోజున గ్రామంలో టీడీపీ తరపున గ్రామంలో ప్రచారం చేయడమే కాకుండా గ్రామ సర్పంచ్ అయిన తనను అంతు చూస్తామని బెదిరించారని ఆరోపించారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఈశ్వరస్వామి తిరునాల

- నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం
- 23న రథోత్సవం



తిరునాలకు ముస్తాబైన ఈశ్వరాలయం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో వెలసిన శ్రీ ఈశ్వరస్వామి తిరునాల మహోత్సవం ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కార్తీక్ సోమవారం తెలిపారు. తిరునాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయానికి ముందు భాగంలో ఆకుపచ్చని పందిరి వేశారు. 25వ తేదీ వరకు తిరునాల మహోత్సవాలు ఆలయ ప్రధాన అర్చకులు లాల్ బహదూర్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

నేడు పార్వతీపరమేశ్వరుల కల్యాణం

మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సవమూర్తులకు వివిధ ప్రత్యేక పూజలు, శివుడికి అభిషేకాలు, గణపతి పూజ, రాత్రి కల్యాణ తంతు నిర్వహిస్తారు.

రేపు ప్రభోత్సవం

22న ఉదయం నుంచి ఉత్సవమూర్తులకు అభిషేకాధిపూజా కార్యక్రమాలు, సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రభవాహనంపై ఉంచి గ్రామ పుర వీధులవెంట ఊరేగింపు నిర్వహిస్తారు.

23న రథోత్సవం

23న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శివపార్వతులకు అభిషేకాలు, విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించడం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం రథవాహనంపై ఉత్సవమూర్తులను వేయించింపజేసి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి గ్రామ పురవీధుల వేంట రథోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

24న పారువేట

24న శివపార్వులతకు అభిషేకాలు, ప్రత్యేకపూజా కార్యక్రమాలు, ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకీలో వేయించింప చేసి గ్రామంలో ఊరేగింపు చేసి, గ్రామ శివారుల్లోకి వెళ్లి పారువేట ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

25న తిరునాల ముగింపు

25న తీర్థావళి, విశేష పూజాకైంకర్యాలు నిర్వహించి శ్రీ ఈశ్వరస్వామివార్ల తిరునాల ముగింపు కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మహానంది: మండలపరిధిలోని బుక్కాపురం పెట్రోల్ బంక్ వద్ద సోమవారం మహానంది వెళ్తున్న ఓ బైక్ ఎగిరిపడటంతో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. అనుమతులు లేకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంవల్లే ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నంద్యాల-మహానంది రహదారిలో అనుమతులు లేకుండా ఎవరి స్వార్థం కోసం వారు ఏర్పాటు చేసుకున్న స్పీడ్ బ్రేకర్ల ద్వారా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మహానందిలోనూ కొందరు వ్యాపారులు, లాడ్జీల నిర్వాహకులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకున్నారు. వీటి వలన పలువురు భక్తులు గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆర్అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి అనుమతులు లేకుండా అనధికారికంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులను నివారించాలి

ఆత్మకూరు: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మున్సిపల్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ నాయకులు డి.రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, షేక్ ఇస్మాయిల్, జి.నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. సోమవారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని 24వ వార్డులో పారిశుద్ధ్య లోపం వల్ల ప్రజలు అతిసారా వ్యాధితో బాధపడుతున్నారన్నారు. పట్టణంలోని అనేక వార్డుల్లో మంచినీటి కుళాయిల్లో ఇప్పటికీ బురదనీరు, మురుగునీరు వస్తోందన్నారు.